# ప్రేమ ద్వేషం

"అన్నయ్యా! నేను రెడీ!"
అంటూ వచ్చింది చెల్లి.

"సినిమాకంటే నువ్వు రెడీ కానిదెప్పుడులే" అన్నాను ఎగతాళిగా.

"అక్కడికి నువ్వెక్కువ చూడనట్టు! పద పోదాం మరి" అంది. బయల్దేరాం.

కాలేజికైతే మందగమనంతో సాగే మా చెల్లి టిక్కెట్లయిపోతాయేమో అనే బెంగతో ఉరుకులు పరుగులు పెట్టించి మరీ థియేటరు చేరుస్తుంది. చెల్లితో సినిమాకు బయల్దేరితే టిక్కట్లు దొరక్కపోవడం అందుకే జరదు; ముందుగా పోవడంవల్ల క్యూలో మేం ముందుంటాం కాబట్టి. సినిమా యింకా గంటకు ప్రారంభమవుతుందనగా థియేటరు దగ్గరుండకపోతే చెల్లికి సినిమా చూసినట్టుండదు. అందుకే అది అమ్మా వాళ్ళతో బయల్దేరదు.

మా ఎదురుగా ఓ అమ్మాయి వస్తోంది. అలవాటైన కళ్ళు అందచందాలను అంచనా వేస్తున్నాయి. అయితే ఆ అమ్మాయిని చూడగానే చెల్లి ఠక్కున ఆగింది. ఇంతలో ఆ అమ్మాయి "హల్లో! వసంతా" అంటూ పలకరించింది:

'ఎక్కడినించి వస్తున్నావు యిప్పుడు?' అంది చెల్లి.

"రాధా వాళ్ళింటికి వెళ్ళి వస్తున్నాను. నువ్వేటు బయల్దేరావు?" అంది, చెట్టంత నన్నుకాస్తా నిర్లక్ష్యం చేసేసి.

జి. నరసింహారావు

"సినిమాకి. రాంంందూ! హాయిగా ఎంజాయ్ చెయ్యొచ్చు" అంటూ రిక్వెస్ట్ చేసింది చెల్లి.

"సారీ! పనుంది. ఇంకోకసారి వెళ్దాం. టాటా..." అంటూ ఆ అమ్మాయి మమ్మల్ని దాటేసింది.

అంతవరకూ వెయిట్ చేస్తున్న నన్ను చూసి 'ఇంకపద' అంది చెల్లి.

నడుస్తూ "ఎవరే ఆ అమ్మాయి?" అన్నా ఇటీజ్ బట్ నేచురల్!

అది పెంకెగా "ఎవరయితే నీ కెందుకు?" అంది. నిజమే!

నేను పెద్ద యింటరెస్టు లేనట్టు "అఁ అదికాదు! నీ ఫ్రెంశా అని" అన్నా.

తను వెంటనే "లేకపోతే నీ ఫ్రెండా" అంది.

అర్థమవుతోంది కదా మా చెల్లి.

నైనేను "బాగుంది. నా ఫ్రెండయితే నీతో మాట్లాడుతుందేమిటి? అయినా ఆడపిల్లల్లో నాకు ఫ్రెండ్సున్నంత అదృష్టం గూడానా!" అన్నా.

"అయితే అది మరి తెలిసినవాడివి నీ ఫ్రెండా అని అడగడమెందుకు? బొత్తిగా ఇకానమీ ఆఫ్ వర్డ్సు లేదు" అంది చెల్లి తనది పి. యు. సి. లో బి. పి. యల్ (లాజిక్) గ్రూపు లెండి. ఆ లాజిక్ యిలా ఉపయోగపడుతూంది

"ఆ మాత్రం తెలియక కాదు! ఆ అమ్మాయి పేరేమిటో తెలుసుకుందామని అడిగాను" అన్నాను.

"మరయితే ఆ డొంక తిరుగుడు ప్రశ్న లెందుకు? డైరెక్టుగా అడిగితే పోలా! అయినా ఆ అమ్మాయి ఊరూ, పేరూ నీ కెందుకు?" అంటూ క్రాస్‌—ఎగ్జామిన్ చేసింది. అందుకే నాన్నగారు దీనికి లా చెప్పిస్తా నంటున్నారు కాబోలు.

"బాగుంది. పేరు తెలుసుకోవడంలో తప్పేమిటుంది? నీ ఫ్రెండు పేరు నాకు తెలియకూడదా?" అన్నా.

"నా ఫ్రెండు పేరు మధ్య నీ కెందుకు? అయినా అసలు అమ్మాయిల ఊసు నీ కెందుకు?" అంటూ నిలేసి అడిగింది.

యౌవన సహజమైన ఉత్కంఠ ఆపుకోలేక అటువంటి వివరాలు మనం కోరుతాం. అంత మాత్రంచేత అపార్థం చేసుకుని, యిలా నిలవేస్తే ఏం సమాధానం చెప్పగలం చెప్పండి.

"భేష్! పేరడిగితేనే ప్రేమించేసానంటున్నా ననుకున్నట్లుంది నువ్వు. అయినా యీ అనుమానాల జబ్బు అమ్మమ్మదగ్గర్నుంచి నువ్వెప్పు డెరువు తెచ్చుకున్నావమ్మా చిట్టి తల్లీ" అంటూ ఓ చెణుకు చెణికాను.

"నువ్వు నే నలా అనుకున్నా నేమో అని అనవసరంగా అనుమానం పడుతున్నావుగాని నే నలా



అనలేదే! అయినా ఆ అమ్మాయికి నాకు టర్మ్స్ బాగులేవు. పేరు చెప్తే నవ్వూరుకుంటావా? కాసు మేటూ అంటావు. మంచి క్లోజ్ ఫ్రెండేనా అంటావు. ఇంక డొంకంతా కదపాల్సి వస్తుంది. అందుకనే పేరు చెప్పలే" అంది చెల్లి.

అద్దదీ సంగతి. దీనికో పెద్ద బ్యాక్ గ్రౌండ్ ఉందన్నమాట. ఇంత ఫ్లాష్ బాక్ లోకి చెల్లాయిని తీసుకుపోయి కథ చెప్పించాలి అనుకునేటంతలో థియేటరు చేరుకున్నాం.

టిక్కెట్టుతీసుకుని కూర్చున్నాక–

"ఇప్పుడుచెప్పు 'జరిగిందేమిటో అసలు!' అన్నా, ఎలక్షన్ ప్రాపగాండాలో దెబ్బలు తిన్న సహచరుడిని సావధాన పరచి, జరిగిన విషయం చెప్పమనే నాయకుడిలా

"నే చెప్పను. అయినా ఈ మధ్య ఆడవాళ్ళ విషయాలమీద ఇంటరెస్టు పెరిగిందేమిటి నీకు?" అంది చెల్లి. ఇది రణమొండి దీన్నోట్లోంచి

యీ కథ పలికించడం వియత్నాం ప్రాబ్లెమంత ప్రాబ్లెమయిందే. కాని దీని టక్కులు మనదగ్గరా?

"సరే, అయితే! ఈమారెప్పుడు, నా ఫ్రెండ్స్ వచ్చినపుడు మా దగ్గర కూర్చుని మా కబుర్లు వినకు. అణా లైబ్రరీనుంచి డిటెక్టివ్‌లు తెమ్మనకు. సినిమాకు నీతో రమ్మనకు. మొన్న రాధాకృష్ణగాడూ, నేను దెబ్బలాడుకుంటే 'ఏం జరిగిందని' నన్ను వేపుకు తినేసి మరీ, జవాబు చెప్పించలా! నీకయితే రొష్టు. మాకయితే ముక్కునా! ఈమారు నా రూమ్‌లోకి రా. కాళ్ళు విరగ్గొడతాను' అంటూ, చిన్న అల్టిమేటం జారీ చేశాను. నాకు తెలుసు యీ దెబ్బతో అది దారికి వస్తుందని. ఎందుకంటే అది కబుర్లపోగు. ఏది లేకపోయినా బ్రతగ్గలదుగాని బాతాఖానీ, సినిమాలు, డిటెక్టివ్‌లు లేందే అది బ్రతకలేదు.

"అక్కడికి నవ్వూ నీ ఫ్రెండ్స్ లేకపోతే రోజు గడవనట్టు పెద్ద పోజు కొట్టకు! బ్రతిమాలితే చెప్పేదాన్నిగా! అయినా దానికి ఎడ్వర్డ్ లైజ్ మెంటు యిప్పకు మధ్య నేను చస్తాను. ముఖ్యంగా బావకు చెప్పకు" అంది. బావంటేచాలు దీనికిచచ్చేంత భయం. వాడు డబ్బా కొట్టడంలో ఫస్టు. వాడు వేసిన పిట్ ఇప్పటికీ పొల్లు పోలేదంటే వింతకాదు. ఆ సబ్జెక్టులో వాడు థీసిస్ ప్రొడ్యూస్ చేస్తాడు ఇవాళో, రేపో.

క్రిందటి నెల మా కాలేజీలో పాటల పోటీలు జరిగాయి తెలుసుగా. ఇంకా అప్పటికి తను ఈ ఊరొచ్చి కొంచెం రోజులే అయినా నాకు మంచి ఫ్రెండయింది. తను మీ కృష్ణశాస్త్రిగారి "మధురానగరి సమీపంలో," 'మోయింపకోయ్ మురళి' పాడింది. నిజంగా బాగా పాడింది. నేను "ఎంకి పాటలు" "గుండె గొంతుకలోన కొట్లాడుతాది," "ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా" పాడాను. ప్రైజులు డిస్ట్రిబ్యూట్ చేసే అతనికి తెలుగు సాహిత్యం మీద, ముఖ్యంగా ఎంకి పాటల మీద మంచి అభిమానం వుందట. ఆయన మాట్లాడుతూ "ప్రైజు ఆ-అమ్మాయికిచ్చినా" (అంటే మా ఫ్రెండు కన్నమాట) "ఎంకిహృదయంతో పాడింది: ఎంకిలా ఆవేదనను అనుభవించి ఆలపించింది కాబట్టి వసంతకు నా అభినందనలు" అన్నారు.

దాంతో మొదలయింది. ఇంటికి ఆడపిల్లలందరం వచ్చేస్తూంటే, వెనక బీటు జెన్ట్సిబుల్స్ లాంటి స్థానిక రోమియో సంఘంవారు ఒకటే కాకిగోల "ఎంకి! ఎంకి!" అంటూ. పెంకెగా సమాధానం చెబుదామనుకున్నాగాని, అల్లరవుతుందని ఊరుకున్నాను. అయితే, తను గూడా, అబ్బాయిలలాగానే "ఎంకీ! ఎంకీ" అంటూ ఎగతాళి చేయడం ప్రారంభించింది. మా

కోతులు కూడా జతచేరి ఒకటే కోరస్ "ఎంకీ! ఎంకీ" అంటూ.

నిజం చెప్పొద్దూ! నాకు బలే కోపం వచ్చింది అయితే కోపగించుకుంటే ఉడుక్కున్నా నంటారు. మరింత ఎగతాళి చేస్తారు స్పోర్ట్సు మన్ స్పిరిట్ లేదని అందువల్ల వాళ్ళెవరితోనూ మాట్లాడకుండా యింటికి వచ్చేశాను" అంటూ ఆగింది చెల్లి.

"మంచిపని చేశావ్" కూచిపూడి భాగవతంలోని మాధవిలా అన్నాను.

"నీ సర్టిఫికేట్లేం అక్కరలేదు గాని, తిన్నగా విను. ఆ రాత్రి అలా అయిపోయిందా? ఆ మర్నాటి నుంచీ కాలేజీ అంతా అబ్బ! ఒకటే గోల. 'ఎంకీ, ఎంకీ' అని. ఓ ప్రబుద్ధుడు 'ఆపలేనే ఎంకి ఈ వలపు యినురు' అని స్వంత కవిత్వం చేర్చి పాడేశాడుగూడా. మరో రాస్కెలు "మేకప్ మార్చాలోయ్! మెళ్ళో పూసలపేరు తల్లో పువ్వులదండ, వనకిన్నెరలా ఉండాలి' అంటూ వాడి పాండిత్య ప్రకర్షను చూపించడం ప్రారంభించేడు. దాంతో మిగతా వాళ్ళు వంతపాట పాడుతూ, తెగ అల్లరి చేయడం ప్రారంభించేరు. వర్స్ట్ బ్రూట్స్" అంటూ చెల్లి కసి తీర్చుకుంటోంది.

అనువుగాని వేళ నోరెత్త కూడదన్న సిద్ధాంతానుసారం నోర్మూసుకున్నాను నేను.

"అబ్బాయిలంటే మరోపని లేదు కాబట్టి అంటారు. తప్పదు కాబట్టి భరిస్తాం అయినా అప్పటికే కోపం తారాపథాన్నంటుకుంది. కోపంతో బాటు ఏడుపూ వచ్చేస్తోంది. వీళ్ళకి తోడు తను. తోటి క్లాసుమేటు. మంచి ఫ్రెండు కూడా "ఎంకీ! ఎంకీ!" అంటూ నాయుడుబావ పోజులో స్వీట్‌గా అనడంతో నాకు చిర్రెత్తుకొచ్చింది అయితే ఏం చేస్తాం? అప్పటికి "గొల్లపిల్ల" అన్నా. కాని "అలా అని ఆ స్వీకర్ గారవలేదుగా" అంది తను ఎదురు దెబ్బ తీస్తూ. ఆయనెవరోగాని, అతను ప్యాన్ చేసిన కాంప్లిమెంట్ నా ప్రాణాల మీదకొచ్చింది. అప్పటికీ ఊరుకున్నాను, ఎగతాళి భరిస్తూనే...

మా అబ్బాయిలు, అమ్మాయిలు మాత్రం వాళ్ళ డ్యూటీ, ఎవరో డబ్బిచ్చి చేయించినట్లు చేసుకుపోతున్నారు.

కాని ఒకసారి ఏం జరిగిందో తెలుసా?" అంది చెల్లి.

"నువ్వు చెప్తే గదా తెలిసేది" అన్నా. తెలివిగా విట్ వేస్తున్నాననే గర్వంతో.

"అతితెలివి చూపకుగాని, ఎవడో వాళ్ళ కజిన్ అట. అతనికి నన్ను పరిచయం చేస్తూ "ఈ అమ్మాయి పేరు ఎంకి. చాలా బాగా పాడుతుంది" అంది తను. నాకు పిచ్చ కోపం వచ్చింది. అయినా పెద్ద

మనిషి ముందున్నాడుగదా, తర్వాత వార్న్ చేద్దామని ఊరుకున్నా!

ఆయన "వాట్?" అంటూ యింకెక్కడా చోటు లేనట్లు తన ఆశ్చర్యం అంతా నా ముందే ఒలకబోసి "ఎంకి!! చాలా పిక్యూలియర్‌గా ఉందే? మీరింత మోడ్రన్‌గా ఉన్నారు. మీ పేరింత ఔట్ ఆఫ్ డేటుగా ఉందేమిటి? మీ బామ్మగారి పేరా? లేకపోతే. నో నో యూ షుడ్ ఛేంజ్ యువర్ నేమ్ ప్లీజ్" అంటూ నీలాగే అతి తెలివి చూపెడుతున్నాననుకుని పెద్దగా నవ్వాడు. తనూ గొప్పగా శ్రుతి కలిపింది.

నా కసలే కోపం జాస్తీ. తెలుసుగా. అప్పటి వరకూ తమాయించుకున్నాను. నాకు కోపంవస్తే నిన్నూ, నాన్నగారినే లెక్కపెట్టను. అష్టరాల్ వీళ్ళనగా ఎంత?

పిచ్చ కోపంతో. "బిహేవ్ యువర్ సెల్ఫ్! నా పేరు ఎంకి కాదు, మంగీ కాదు. మీ అందరి పేర్లకన్నా నాది మోడ్రన్. అయినా మనిషన్న తర్వాత మర్యాద తెలియాలి. మాట్లాడటం తెలియాలి. వెకిలి నవ్వులు నవ్వటం కాదు. మీ తాతల్లా నేనూ నవ్వుతాను. ఛఛ .. అయినా ఇలాంటి వారితో ఫ్రెండ్‌షిప్ చెయ్యడం నాదే బుద్ధి తక్కువ. హోస్యాలకైనా హద్దూ పద్దూ ఉండాలి. అయాం సారీ ఫర్ యూ" అని నాలుగు చడామడా తిట్టేసి మరీ వచ్చేశాను. మరి తనతో ఫ్రండ్‌షిప్ కట్ చేసుకోవాలను కున్నాను.

కాని ఆ మర్నాడు లీజర్ అవర్‌లో "సారీ వసంతా! అయ్యాం ఎక్స్ట్రీమ్‌లీ రీ నువ్వంత అఫెండవుతా వనుకోలేదు. సరదాగా అందామనేగాని మరే ఉద్దేశమూ లేదు, నిన్నలా పిలవడంలో" అంటూ అపాలజీస్ చెప్పుకున్నది" అంటూ చెల్లి ఆగింది.

"మరింకేం. తీరిపోయింది తగ్గువు. మరిప్పుడు మళ్ళా మీ స్నేహానికేమొచ్చింది?" అన్నా.

"అందుకే నీకు తలకాయ లేదని నే ననేది పూర్తిగా వినకుండా మధ్య యీ చొప్పదంటు ప్రశ్న లెందుకు? అప్పట్నుంచీ తను చాలా రిజర్వుడుగా ఉంటోంది. పలకరిస్తే మాట్లాడుతుంది. అదైనా ముక్తసరిగా తప్పించి పూర్వంలా ఫ్రీగా మాట్లాడదు. మిగతా వాళ్లు గూడా అంతే. అంతకుముందు బలే సరదాగా వెయిటింగ్ రూమ్‌లో మేం తెగ గోల చేసేవాళ్ళం. ఇప్పుడు వాళ్ళంతా ఒకటి. నే నొక్కర్తినే ఒకటి. వాళ్ళతో కలిసి ఏదైనా సరదాగా మాట్లాడటానికి ప్రయత్నం చేస్తే, వాళ్ళా టాపిక్ మార్చి వేస్తారు ఏమర్రా అని నిలదీసి అడిగితే: "నువ్వు వేగంగా అఫెండయిపోతావు బాబూ! ఎందుకొచ్చిన గొడవ" అంటారు. నాతో సరదాగా తిరగకుండా, నాతో

పూర్వంలా మాట్లాడకుండా పోతే నా కెలా ఉంటుంది చెప్పు? తను చాలా మంచిది. తెలివైంది. నాకు మంచి ఫ్రెండుగూడా. ఏదో పొర పాటున అన్నానే అనుకో, అంత మాత్రంచేత మరీ అంతదూరం చేసె య్యాలా! ఇప్పుడే చూశావు కదా! సినిమాకు రమ్మంటే, పనుంది అంది. అదే ఏ రాధో, రమణో అడిగితే తప్పకుండా వచ్చేస్తుంది. తనకి నా మీద అవేళ అలా అన్నానని కోపం అన్నయ్యా! నే నప్పటికీ చెప్పా, జరిగిన పొరపాటు మరిచి పోదాం అని. అలాగే అంది. కాని యింకా రిజర్వ్‌డుగానే వుంటోంది నా కెలా గుంటుంది చెప్పు, మంచి ఫ్రెండుపోతే" అంది చెల్లి. ఇంకా ఏంచెప్పునోగాని లైట్లారిపోయాయి. టైటిల్సు వేస్తున్నారు. చీకట్లో చెల్లి కళ్ళు చెమ్మగిలడం గమనించ గలి గేను.

చెల్లి ది అదోరకం స్వభావం. ఎక్కువగా అభిమానిస్తుంది. అయితే ఆ అభిమానం మన కర్థంకాదు. ఉడుకుమోత్తనం కొంచెం ఎక్కువ కావటంవల్ల, నోరు పారేసుకోవడం అలవాటువల్ల, ఏదో అనేసింది. దాంతో వాళ్ళు, దీన్ని కాస్తా ఒంటి పిల్లి రాకాసిని చేసేసి, దూరంగా ఉంచసాగారు. అసలే ఇది సోషల్ బర్డ్. అందులోనూ అభిమానించే హృదయం. చస్తే అలా ఉండలేదు. ఉండలేకపోతుంది. దాని కోపం తామరాకుల మంటలా క్షణికం. అందు వల్ల కుడితిలో పడ్డ ఎలకలా గిలగిల కొట్టుకుంటూంది. ఆ అమ్మాయి తనను చేరనీయక పోవడంతో, పైకి ద్వేషిస్తూంది. ప్రేమా - ద్వేషాల సంఘర్షణ సమయంలోనే నేను ప్రశ్నలు వేస్తే పెంకెగా సమాధానం చెప్పింది.

అందువలనే "ప్రేమా, ద్వేషమూ, హృదయమున్న చోట ఉంటా" యని స్వామీజీ చెప్పారు.

ప్రేమా—దేషాలకు మధ్య 'వన్-వన్-కరెస్పాండెన్సు' ఉందేమో తెలీదుగాని, ఈ రెండు ఒకదా న్నొకటి అంటిపెట్టుకు తిరుగు తుంటాయి.

ఈ విషయంపై ఎవరైనా రీసెర్చి చేస్తే బాగుండిపోను.

***